# కంట్రాక్టరు వీరన్న

శ్రీ చిలుకూరి శేషగిరిరావు

ఆ జిల్లాలో కంట్రాక్టరు వీరన్నను ఎరగనివారు ఎవ్వరూ వుండరని చెప్పాలె. కూలినాలి చేసుకొని చాలీచాలని గంజినీళ్లు త్రాగి ప్రాణాలను నిలుపుకొంటూవుండే ఈ కష్టజీవులనోళ్లలో అతని నామమంత్రం నిత్యమూ జపింపబడుతూంటుంది. P.W.D. లోగాని, డిస్ట్రిక్టుబోర్డులోగాని మరి ఏయితర శాఖల్లోగాని ఏచిల్లరమరమత్తులు వచ్చినా, ముందు కంట్రాక్టరు వీరన్నను పిలవాల్సిందే! కారణం ఏమంటే అతనితో సమానంగా కంట్రాక్టు పాటపాడేవారుండరు. అదికాక ఇతనిపూర్వులు తరగని ఆస్తిని కష్టపడి నిల్వవుంచి పోవటంచేత, యితడు ఆ ధనప్రవాహాన్ని వినియోగించి, యీ చిల్లర దేవతల కందరికీ నిత్యనైవేద్యాలర్పించి గొప్ప పలుకుబడిని సంపాదించాడు. అందుచేత ఏ కంట్రాక్టు వచ్చినా మారుమాటలేకుండా వీరన్న చేతుల్లో పడేది. అలాంటప్పుడు నిత్యమూ తమకు గంజినీళ్లకు దారిచూపిస్తున్న యీ వీరన్న నామాన్ని వాళ్లు జపిస్తూంటూ రనటంలో ఆశ్చర్య మేముంది?

అసలు వీరన్న పూర్వులది తూర్పు దేశం. అక్కడ వాళ్లకు కడుపుకు చాలినంతగంజి, వొళ్లు కప్పుకోనేందుకు చాలినబట్టా కరవవటంచేత, యీ తూర్పుగోదావరిజిల్లాకు జేరుకొని, మగవాళ్లు కూలిచేస్తోంటే, ఆడవాళ్లు సంపన్న బ్రాహ్మణగృహస్థులయింట్లో పాచిపనులుచేసి జీవిస్తుండేవాళ్లు. ఇలా వుండగా, రంగంలో కావలసినంతమంది కూలీలు లేరని అక్కడ పని విశేషంగా వుండి కూలి చాల హెచ్చుగా దొరుకుతుందని తెలియవచ్చింది. అప్పుడు ఈ వీరన్న పూర్వులు బుట్టా, తట్టా సర్దుకొని రంగం ప్రయాణం కట్టారు. నిజంగా రంగంలో కష్టపడినవానికి చేతినిండా డబ్బు దొరికేది. కడుపునిండా తిండీ, వొంటినిండా బట్టా కట్టగా నాల్గురూకలు మిగిలేట్టుగానే వుండేది. ధనార్జనయందు ఆశయున్నవాళ్ళు దానికోసం ఎన్నిపాట్లనో పడతారు. మన వీరన్న పూర్వులు వొళ్ళువంచిపనిచేస్తూ పొదుపుగా సంసారం చేసుకొంటూ వొకపదివేల కరకు రూపాయలను కంటజూచి స్వగ్రామాన్ని జేరుకున్నారు. ఆధనంతో వీరన్నతండ్రి భూమిపుట్రా కొని వ్యవసాయంచేస్తూ మంచి మోతుబరిరైతని పేరుపొందాడు.

వీరన్నకు సుమారు నలభై ఏళ్లుంటాయి. మనిషి మంచి జమాను. ఆరడుగుల పొడవుండి పొడవుకు తగ్గ దేహపుష్టిగలిగి చూచుటకు గంభీరంగా కనిపిస్తుంటాడు. పూర్వం, రాజులూ, వెలమదొరలూ మీసం మీద నిమ్మకాయలను నిలబెట్టేవారని చెబుతే అసలు మీసంలేని బొద్దింకమీసాలకు అలవాటుపడ్డమనం వెటకారంగా నవ్వుతాం. కాని ఈవీరన్న మీసాలు చూశాక నిమ్మకాయలే కాదు నారింజకాయలు కూడా నిలబెట్టవచ్చని వప్పుకుంటాము. అతడు చిన్నతనంలో ఫస్టుఫారం ఆనర్సుచదివినా యీ పెద్ద వుద్యోగస్థుల ప్రాపకం వచ్చాక నాలుగుబోట్లేరు యింగ్లీషుముక్కలు కూడా మధ్యమధ్య విసరటం నేర్చుకున్నాడు. ఆఫీసర్లతో మాట్లాడేటప్పుడు మామూలు వేషం దర్జాకు లోటని శిల్కుసూట్లూ, బూటూ హేటుకూడా వేయటానికి అలవాటుపడ్డాడు. ఈ కంట్రాక్టులలో నాలుగురాళ్లు మిగిలాక యింజనీర్లతో సమానగౌరవం సంపాయించాలని ఫోర్డుకారొకటి కొన్నాడు. మునుపు వీరన్న అని పిలుస్తుండేవారంతా యిప్పుడతనిని వీరన్న దొరగారని పిలుస్తుంటారు.

## ౧

అవి ఏప్రెలు నెలలోని కడపటిరోజులు. డిస్ట్రిక్టుబోర్డువారి రోడ్డును బాగుచేయిస్తున్నాడు కంట్రాక్టరు వీరన్న. ఆడవాళ్లూ, మగవాళ్లూ కలసి సుమారు వొవందమంది పనిచేస్తున్నారు. కొందరు మగాళ్లు గునపాలతో రోడ్డునుత్రవ్వుతోంటే మరికొందరు

కంకరను జల్లివేస్తున్నారు. ఆడకూలీలలో కొందరు చెట్ల చాలీచాలని నీడలో కంకరను బ్రద్దలుకొడుతుంటే మరికొందరు డ్రమ్ములలోని నీటిని బిందెలతోనింపి రోడ్డును తడుపుతున్నారు. మరికొందరు ఆడవాళ్లూ, మగవాళ్లూ కలిసి పాటపాడుతూ రోలరును దొర్లిస్తున్నారు. సూర్యుడు నడినెత్తిమీద కొస్తూ తీవ్రంగా ప్రకాశిస్తున్నాడు. పాపం! ఆకూలీలు, క్రిందకాళ్లూ, పైన మాడూ మాడుతూ చెమటలుకారుస్తున్నా, చెట్టుక్రింద నీడలో కూర్చుండి చుట్టకాలుస్తూ అకారణంగా బండబూతులు తిడుతూ మధ్యమధ్య చేతి దూలచే చింతబరికెతో అమాయకుల వీపులమీద బాదుతుండే మేస్త్రీని చూచి గడగడలాడుతూ చురుగ్గా పనిచేస్తున్నారు. చెట్లకొమ్మలకు కట్టియున్న జోలెలలోని బిడ్డలు పాలకోసం 'క్యారు, క్యారు' మని ఏడుస్తున్నా! పాపం! ఆతల్లులు ప్రత్యక్షయముడైన మేస్త్రీని చూచి మనస్సు పిల్లలమీదకు లాక్కొపోతూండగా తప్పనిసరిగా పనిచేస్తున్నారు.

సాయంత్రం అయిదుగంట లవుతుంది. అప్పుడే సూర్యుడు కొంచెం శాంతపడి అలసట తీర్చుకోటానికి యింటికి పోతున్నాడు. ఫర్లాంగుదూరంలోంచి వీరన్న కారు హారను చప్పుడు 'బొం, బొం' మని వినిపించింది. అంతవరకూ పొగచుట్టను కాలుస్తూ, ఓకూలిదాన్ని బూతులుతిడుతూన్న మేస్త్రీ, హారన్‌చప్పుడు వినంగానే కంగారుపడుతూ నోటిలోనిచుట్టను పారేసి ఒకసారి తలపాగా, కోటూ సర్దుకొని కూలీలందరకూ చురుగ్గా పనిచేయాలని వార్నింగ్ యిచ్చిచేతులు కట్టుకొని కంట్రాక్టరు రాకకోసం ఎదురుచూస్తూ నిలుచున్నాడు.

కంట్రాక్టరువీరన్న కారు దిగి స్పెన్సరుసిగరును కాలుస్తూ చేతిలోని **Hand stick** ను వూపుకొంటూ వచ్చాడు. మేస్త్రీ, అతివినయంతో నమస్కరించి ఆరోజుజరిగిన పనినంతా చూపిస్తున్నాడు. ముందు గునపాలతో రోడ్డును త్రవ్వుతోన్న కూలీలదగ్గరకు వచ్చారు. కంట్రాక్టరువీరన్నను చూడంగానే కూలీలలో భయమూ, చురుకూ పుట్టింది. గునపాలను ఎత్తి 'ధన్, ధన్'మని రోడ్డును త్రవ్వుతున్నారు. ఆరోజుకి వారు త్రవ్విన ప్రదేశం చూపించినాడు, పని చాలా చురుగ్గా జరిగిం దని మనవిచేసుకున్నాడు మేస్త్రీ. వీరన్న మందహాసం చేస్తూ మరి నాలుగడుగులు ముందుకేశాడు. ఆడాళ్లూ,మగాళ్లూ కలసి కంకరను గంపలతో ఎత్తి రోడ్డుమీద పోస్తున్నారు. వీరన్న, పనంతా చురుగ్గా జరగటం చూచి మేస్త్రీని మెచ్చుకుంటూ కొంచెం ముందుకు నడిచాడు. అక్కడ మరునాటికి నీళ్లు నిలవయుంచటానికై పెద్దరేకుడ్రమ్ములు పాతిక వున్నాయి. ఆప్రదేశానికి రెండుఫర్లాంగుల దూరములోనున్న చెరువునుంచి ఆడవాళ్లు బిందెలతో నీళ్లుతెచ్చి ఆడ్రమ్ములలో పోస్తున్నారు. వీరన్న సిగరుపొగను రింగురింగులుగా వొదుల్తూ దూరంనుంచి నీళ్లబిందెలను తెస్తూన్న కూలివాళ్లకేసి తదేకదృష్టితో చూస్తున్నాడు.

ఆ ఆడకూలీలు దూరంనుంచే వీరన్నను చూచి భయంతో చురుగ్గా నడుస్తూ వొచ్చి నీళ్లను డ్రమ్ములలో దిమ్మరించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెళ్లిపోతున్నారు. మనవీరన్న దృష్టి అందులోని ఒకమంచి పడుచుదనంలోయున్న యువతిపై సోకింది. ఆయువతికి సుమారు యిరవై ఏళ్లుంటాయి. చంద్రబింబంలా గుండ్రమైన మొహం. అటుతెలుపూ యిటుపసుపూ కాకుండా దోరజామిపండులా గుంటుంది శరీరపుఛాయ. అంతలావూ, మరీసన్నము కాకుండా వయస్సుకు తగ్గ కండపుష్టిగలదేహం. అప్పుడే ఆమెలోని యౌవనపుష్పం పరిపూర్ణంగా వికసించుతూండటంచేత శరీరమంతా పరిపూర్ణయౌవనపుశోభచే మిలమిలలాడుతోంది. కొద్దికొద్దిగా నొక్కులుదీరిన తలకట్టుకు తైలసంస్కారము లేకపోవుటచే ముంగురులు చెదరి ముఖంమీద చిరుగాలికి చిందులు త్రొక్కుతున్నాయి. అన్నిటికన్నా ఆమె నెత్తిమీద బిందె పెట్టుకొని మందగమనంతో వయ్యారాన్ని వొలికిస్తూ నడచి వొస్తూంటే వీరన్న యీ దివ్యమంగళవిగ్రహాన్ని చూచి మోహపరవశుడైపోయాడు. మీసాన్ని వడివేస్తూ తదేకదృష్టితో ఆమెకేసి చూస్తున్నాడు. ఆ యువతి నీళ్లను డ్రమ్ములో వొంపేసి వీరన్నకేసి చూసింది. అలా చూడటంలో ఆమె కొంచెం భయంతో కంపించిపోయింది. ఇంద్రనీలమణుల కాంతులను మించు ఆనేత్రద్వయంలోంచి భీతిని, జాలిని వెలి

గ్రక్క చూపును చూచినంతనే వీరన్న హృదయం జలదరించిపోయింది. ఆమె తక్కినవారితో కలసి నీరు తేవటానికి వెళ్లిపోయింది.

వీరన్న దేహంలోని ప్రతి అణువూ, ఆమెలోని దివ్యామృతాన్ని గ్రోలాలని విజృంభించి అతడిని తలక్రిందులు చేస్తున్నది. అతడు తనకారులో కూర్చుండి తన వెంటవచ్చి చేతులు కట్టుకొని నిలుచున్న మేస్త్రీని చూచి "ఏమోయి! యిందాక నీళ్లు తెస్తూన్న ఆ అందమైన పిల్లను గురించి ఏమైనా చెప్పగలవా ?" అని అడిగాడు. అప్పుడే ఆపిల్లమీద వీనికన్ను పడిందని పసికట్టాడు మేస్త్రీ. అతడు చేతులు నలుపుకొంటూ "చిత్తం అది వెలమలపిల్లండి. ఇక్కడకు మైలుదూరంలోనే వుంది దానియిల్లు. అదీ దాని మొగుడూ యిద్దరూ మనదగ్గరే పనిచేస్తున్నారు. చాలా అందమైంది. ఒళ్లొంచి కూలికితగ్గ కష్టంచేస్తుం"దన్నాడు. వీరన్న ఆనందంతో పరవశుడైపోయాడు. మెల్లగా మేస్త్రీ చెవులో ఏదో వూది కారు ఎదర నిలుచుండి ఏదో రిపేరు చేస్తున్నట్టు నటిస్తున్నాడు.

మేస్త్రీ కూలీలదగ్గరకు వచ్చాడు. మామూలుగా ఆడవాళ్లు నీళ్లుమోస్తున్నారు. మేస్త్రీ ఆ ఎర్రటి యువతిని పిలిచి "లక్ష్మీ ! దొరగారి కారులో నీళ్లయిపోయాయట. ఒక బిందెడునీళ్లు పట్టుకెళ్లి పోసిరా" యని హుకుం యిచ్చాడు. లక్ష్మి నీళ్లు పట్టుకొని బయల్దేరింది. రోడ్డు మరామత్తులో వుండటంచేత రెండువందల గజాలదూరంలో వీరన్న కారు ఆగింది. నిజానికి కారులో నీటిఅవసరం లేకపోయినా ఆమెతో మాట్లాడాలనే వుద్దేశ్యంతో యిలా అన్నాడు. పాపం! లక్ష్మికిదంతా తెలియదు. ఆమె మెల్లిగా నడుస్తూ కారు దగ్గరకు వచ్చింది. వీరన్న నలుప్రక్కలా ఒక్కసారి చూచి ఎవరూ లేనట్టు కనిపెట్టాడు. అతడుచుట్ట కాలుస్తూ అదేపనిగా కోరచూపులతో ఆమెకేసి చూస్తున్నాడు. అతడలా చూట్టం లక్ష్మికి సిగ్గేసి మొహం వంచుకుంది. వీరన్న మందహాసం చేస్తూ ఆమెతో యిలా మాట్లాడాడు.

"నువ్వు చాలామంచిదానివనీ, కష్టపడి పనిచేస్తావనీ మేస్త్రీ చెప్పగా విని చాలాసంతోషించాను. ఇన్నాళ్లనుంచీ పనిచేస్తున్న నిన్ను చూడక గొప్పపొరపాటు చేశాను. ఈకారు ఎంత అందంగా వుందో చూశావా ? ఎప్పుడన్నా యిలాంటికార్లో ఎక్కావా ?" అని అడిగాడు. కాని లక్ష్మి మాట్లాడలేదు.

"అబ్బా ! ఎంత అందంగా వున్నావు ! రంభలా గుండేదానివి నీకీ మాసిన బట్ట లేం బాగున్నాయి? మాలాంటివాళ్ల యిళ్లలోనయితే నగలూ, సిల్కుచీరలూ, సెంట్లూ, పువ్వులూ ఎంతోసుఖంగా దర్జాగా వుండవచ్చు." ఆమెకేసి తీక్ష్ణంగా చూశాడు. పాపం! లక్ష్మి సిగ్గుపడింది. ఇతనిమాటలవల్ల ఆమెకు భయం వేసింది.

"చూశావు! ప్రపంచంలో నీలాంటి అందమైన ఆడది యింకొకతె వుండదు. అలాంటప్పుడు ఆముష్టి వెధవను చేసుకొని వాడితోపాటు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కూలి చేసుకొంటూ అర్ధాకలితో బాధపడటం ఏమీ బాగాలేదు. నామాటవిని ఆ వెధవని వదిలేసి నాదగ్గరకు వచ్చేయి. నిన్ను మహారాణిని చేస్తా" నన్నాడు.

ఈమాటలు వినంగానే లక్ష్మికి చాలా కోపం వచ్చింది. అందులో అతడు తనభర్తను నిందించంగానే చాల బాధపడింది. ఆమెకోపంతో "కారుకి నీళ్లుకావాలన్నారుట. ఎక్కడపోయాలో చెబితే పోసి వెడుతా"నంది. అందులకు వీరన్న వెకిలినవ్వు నవ్వుతో "కారుకు నీరూ నిప్పూ అక్కర్లేదు. నీ దర్శనంకోసం యిలా రప్పించాను. ఇద్దరమూ కార్లో కూర్చుండి కొంచెంసేపు అలా తిరిగివద్దాంరా!" అని ఆమెచేయి పట్టుకొని కార్లోకి లాక్కోబోయాడు. కాని లక్ష్మి కోపంతో చురచురచూస్తూ ఆ బిందెలోని నీరు క్రిందకువొంపేసి ఖాళీబిందెతో వెళ్లిపోబోయింది. కాని వీరన్న ఆమెను అడ్డగించి ఆమెను బలవంతముగా కౌగలించుకొనబోయాడు. కాని మానాభిమానములుగల లక్ష్మి రౌద్రంతో పెనగులాడి వీరన్న గూబకు బెత్తెడు ఘాటైన చపేటాను తగిలించింది. ఇంతలో దూరంనుంచి ఎవరో వస్తూండటం చూచి వీరన్న లాభములేదనుకొని గూబ తడుముకొంటూ కారుచక్రాలకు బుద్ధిచెప్పాడు. హృదయభారంతో ఖాళీబిందెను పట్టుకొని తక్కినవారిని జేరుకొంది లక్ష్మి.

## 3

సహజంగా ఆడువారిచేతులు మెత్తనివే అయినా మొదటినుంచీ లక్ష్మి కూలినాలి మొదలగు కాయకష్టము లగు పనులకు అలవడుటచేత ఆమెచేయి కొంచెం గట్టి పడిందనే చెప్పాలి. దీనికితోడు ఆమెయందు తీవ్రమైన క్రోధాగ్ని రగుల్కొనటంచేత ఆమె విసిరినదెబ్బ వీరన్నకు మూడునిముషాలపాటు మూడులోకాలనూ చూపించింది. అతడు యింటికి వెళ్లంగానే తనప్రైవేటు రూములో కూర్చుండి చురచుర మండుతోన్న చెంపను అద్దంలో చూచుకున్నాడు. ఆమె అయిదువేళ్లూ శాశ్వతంగా వుండేటట్లు అతని దవడమీద పుట్టుమచ్చల్లాగు నాటుకొనివున్నాయి. ఆతీవ్రమైన గాయాన్నీ, పరాభవాన్నీ తలంచుకొనంగానే వీరన్నశరీరంలోని నెత్తురంతా క్రోధదావాగ్నిచే వుడికిపోయింది. వెంటనే తనసామర్థ్యాన్ని ఆమెకు చూపించి తనకసిని తీర్చుకోవా లనుకున్నాడు. కాని కొంతసేపు ఆలోచించి ఏవిధంగానన్నా ఆమెను అనుభవించాలని దృఢనిశ్చయపర్చుకున్నాడు. ఆగాయం నలుగురికంటా పడుతుందనే భయంతో వీరన్న రెండురోజులపాటు లోకం కంట పడలేదు.

ప్రతి ఆదివారం కూలీలకు బట్వాడా యిస్తారు. అందుచేత మేస్త్రీ డబ్బుకోసం వీరన్నదగ్గరకు వచ్చాడు. వీరన్న ఆనాడు తనకు జరిగిన పరాభవాన్ని కప్పిపుచ్చి ఆమె తనమాట వినలేదనీ, ఆమెను ఏవిధంగానన్నా వొప్పించి తనకు చేకూరుస్తే మంచి ప్రతిఫలం ముట్టచెబుతాననీ మేస్త్రీకి ఆశ చూపించాడు. డబ్బుఆశ చూపితే ఆమె తప్పకండా లొంగుతుం దనీ అందువలన తనకు మంచిలాభం రాక మానదనీ తలంచి మేస్త్రీ బ్రహ్మానందభరితుడైపోయాడు.

ప్రతివారం వీరన్నే స్వయంగావచ్చి బట్వాడా చేస్తుండేవా డెంచేతో ఆరోజు ఆపనిని మేస్త్రీకే వప్పజెప్పాడు. ఆరోజు ఏదో మిష పెట్టుకొని బట్వాడా ఆలస్యంగా యివ్వటం ప్రారంభించాడు. ముందు మగాళ్లందరికీ కూలీ లిచ్చేశాడు. సూర్యాస్తమానం అవంగానే క్రమంగా కారుచీకటితెరలు లోకనాటకరంగాన్ని కప్పుతున్నాయి. తరువాత మేస్త్రీ ఆడవాళ్ల నొక్కొక్కరినే పేరెట్టి పిలిచి వారికూలీ యిస్తూన్నాడు. ఆరోజు బట్వాడా చాలా ఆలస్యంగా అందటంచేత కూలీలంతా గబగబా యిండ్లకు పోతున్నారు. ప్రతిసారీ లక్ష్మిపేరు మొదట్లో వచ్చేది. ఆరోజెంచేతో చివరదాకా వుండిపోయింది. పాపం! లక్ష్మిపడే ఆరాటానికి అంతులేదు. ఆమె భర్తవొంట్లో సుస్తీగా వుండటంచేత రెండురోజులనుంచి అతను కూలికి రావటంలేదు. ఇంట్లో యింకా దీపమన్నా వెలిగించలేదు. తాను వెళ్లి బజారునుంచి వెచ్చం తెచ్చి గంజి కాచిపోసేదాకా ఇంట్లో రెండోదిక్కు లేదు. అసలు తానూ కూలికి రావటం మానివేయవలసిందేగాని, ఆరోజు కూలికి రాకపోతే రెండోవారంలోగాని తమ కూలి నియ్యరు. పైగా పనితొందరగా జరగాలని వీరన్న తొందరపడుతున్న సమయంలో కూలికి వెళ్లటం మానేస్తే మేస్త్రీ మళ్లీ కూలిలోకి రానియ్యడేమోయని భయం.

ఆరోజు ఆమె ఎంతత్వరగా యింటికి వెళ్లాలనుకొందో అంత ఆలస్యమూ అవుతోంది. తనతో సాయం వచ్చేవాళ్లెవరూ లేరు. అందరూ కాశీవేపు వెడితే తాను రామేశ్వరంవైపు వెళ్లాలి. ఎప్పుడూ మొదట్లో తన్ను పిలిచేవాడు ఆవేళ పిలవకపోవటంచేత కంగారు పడింది. కాని పేర్లను చదివేతొందరలో మేస్త్రీ తనపేరును పిలవటం మరిచిపోయా డనుకొంది. మేస్త్రీ ప్రతివాళ్ల పేరూ చదివేటప్పుడు తనపేరుకూడా చదువుతా డేమోయని ఆతృతతో అగ్నిజ్యోతిని వెలిగించే చూపులతో ఎదురు చూస్తోంది.

మేస్త్రీ కూలీలందరికీ బట్వాడాయిచ్చి లక్ష్మిని చూడనట్టు లేవబోతున్నాడు. ఇహ వూరుకుంటే లాభం లేదనుకొని లక్ష్మి వినయంగా "బాబుగారూ! నా మాట మరచిపోయారు. మా యిద్దరికూలీ యిప్పిస్తే యింటికి పోయి గంజి కాచుకొంటా"నంది. అందులకు మేస్త్రీ సంభ్రమాన్ని నటిస్తూ — "అయ్యో! ఎంతపొరపాటు పడ్డాను. పాపం! నీకు చాలా ఆలస్యమైనట్టుంది. అయితే రామన్న రెండురోజులనుంచి కూలిలోనికి ఎందుకు రావటంలేదు?" అని ప్రశ్నించాడు.

అందులకు లక్ష్మి కొంచెం విచారంతో "అతగాడికి నాలుగురోజులనుంచీ వొంట్లో సుస్తీగా వుంటండీ! అలాగే రోజు గడవ దనేభయంతో కూలికి వస్తుండేవాడు. రెండు రోజులనుంచి బొత్తిగా వొంట్లో వోపిక లేకపోవటంచేత కూలికిరావటం మానుకున్నాడు. ఇంటి కెళ్లి గంజి కాచిపోయాలి. మీరు దయయుంచి మాయిద్దరికూలీ యిప్పిస్తే త్వరగా యింటికి జేరుకొంటా" నని జాలిగా పల్కింది. ఇదేతగినసమయ మనుకున్నాడు మేస్త్రీ. ఆమెయం దెంతో ఆదరాన్ని చూపిస్తున్నట్లు నటిస్తూ "అలాగా పాపం! ఆ సంగతి ముందే చెప్పియున్నట్లయితే! ముందు మీయిద్దరి కూలీయిచ్చి పంపివేసి యుండేవాణ్ణి. అయితే లక్ష్మి! నీతో ఒకమాట చెబుతాను విను. మొన్న దొరగారు నీతో మాట్లాడినప్పుడు నువ్వు పెంకితనం చేశావంట. అది చాలావెర్రిపని. దొరగారిలాంటివారు నిన్ను కోరారంటే నువ్వు గొప్ప అదృష్టవంతురాల వన్నమాట. ఆయనకు నీమీద ఎంతోకోపం వచ్చింది. ఏమంటావు! దొరవారితో వప్పుకున్నావని చెప్పనా?" అని అడిగాడు.

ఈమాటలు వినంగానే లక్ష్మి నిశ్చేష్టురాలైంది. ఈమేస్త్రీముండాకొడుకుకూడా వీరన్న తరఫున మాట్లాడటం చూచి భయపడింది. కాని కొంచెం ధైర్యంతో — "బాబూ! పెద్దలైన మీరుకూడా యిలా సెలవీయటం న్యాయమేనా? కట్టుకున్న మొగుణ్ణి విడిచిపెట్టి కోరినవాడితో అల్లా వ్యభిచరించటానికి నేను బోగందాన్ని కాను. మీ రిద్దరూ నావిషయంలో గొప్ప పొరపాటు పడుతున్నారు. ఇహనుంచి ఆ ఆశను వొదులుకోండి. ప్రొద్దుపోతోంది. త్వరగా మా కూలియిప్పిస్తే యింటికిపోతా"నంది ప్రార్థనాపూర్వకంగా.

తనప్రయత్నం ఫలించదేమో యని మేస్త్రీ జంకాడు. అయినా ధనాశ చూపిస్తే లొంగుతుం దనే ఆశ మనస్సులో పీడిస్తోంది—"లక్ష్మి! నువ్వు పిచ్చిదానిలా గున్నావు. ఆదొరగారిదర్జా, అయిశ్వర్యమూ చూడకండా మాట్లాడుతున్నావు. నువ్వు 'ఊఁ' అని నీ అంగీకారాన్ని వెలిబుస్తే! నీ శరీరమంతా బంగారం దిగేస్తాడు. వెధవది! రోజుకు పావలా డబ్బుల కూలికోసం రోజంతా మండుటెండలో మాడటం బదులు ఒక్కసారి అంగీకరించావంటే నిక్షేపంగా యిల్లు కదలకండా హాయిగా తిని కూర్చుండవచ్చు. ఇంత అందమైనదానివి దొరగారిలాంటివారి ప్రాపకం సంపాదించావంటే అందానికి తగినసుఖం లభించగలదు. మరొకమాట! నువ్వు నీమొగుణ్ణి వొదిలెయ్యనక్కరలేదు. అత డెలాగూ జబ్బుగా వున్నాడంటున్నావు. అతడు పనిలోనికి రాకపోయినా యిద్దరికూలీ ముట్టజెబుతాను. నీవుమాత్రం కూలికి రాక దొరగారి బంగాళాకు వెళ్లి వస్తుండాలె. ఇదేమీ తప్పుపని కాదు. మీకూలివాళ్లలో అంతా మానం అమ్ముకొనేవాళ్లే. పిచ్చిపిచ్చిపట్టుదలలుమానేసి యీఅయిదురూపాయలూ పట్టుకెళ్లు. మళ్లీ ఎంత కావాల్సివుంటే అంతా యిప్పిస్తా" నని అయిదురూపాయలకాగితం అందించబోయాడు. ఈ మాటలు వినంగానే లక్ష్మిశరీరం క్రోధోద్రేకంచేత కంపించిపోయింది. ఆమె యీనిన పులిలాగ రోషంతో "అయ్యా! డబ్బుకాసించి శరీరాన్ని అమ్ముకోటానికి నేను భోగందాన్ని కానని ముందే చెప్పాను. ఆయనకు డబ్బుంటేమాత్రం సంసారస్త్రీల మానాలనంతా కొందా మనుకున్నాడా? ఇలా ఎంతమంది అమాయకులను మోసగించి వారి మానాలను అపహరించారు? మీ వుద్దేశ్యం ఏంటి? లోకంలో ధనవంతులు తప్ప తక్కిన స్త్రీలంతా మానం అమ్ముకొని జీవించే పచ్చిలంజ లనుకొన్నారా? కూలినాలిచేసుకొని జీవించేవాళ్లకు మానాభిమానము లుండవని మీ సిద్ధాంతమా? తినుటకు తిండిలేకపోయినా ఆకలిబాధకు వోర్చుకొని మలమల మాడుతుంటాము గాని తుచ్ఛమైన భాగ్యభోగములకై మానాన్ని అమ్ముకోము. అసలు అన్ని జాతుల్లోనూ వ్యభిచారము పెచ్చుపెరుగుటకు మీ ధనవంతులే కారకులు. అమాయకులగు పేదలకు కపటపుమాటలుచెప్పి, ధనాశ చూపి వారిమానధనాన్ని కొల్లగొట్టుతున్నారు. ఆయన అడగమంటే, అడగటానికి మీకు నో రెలావచ్చింది? ఇవ్వాళ నన్ను మోహించాడు. రేపు మీ పెళ్లాన్నో లేక చెల్లెలినో చూచి మోహించి వప్పచెప్పమంటాడు. అప్పుడు మీచేతులారా మీ పెళ్లాన్ని అప్పగించగలరా? అప్పుడు మీ హృదయం ఎంత దారు

ణంగా బాధపడుతుందో వూహించారా? బాగా ఆలోచించండి. ఇంక యీ వెర్రి మొర్రి ఆలోచనలు మాని వేయండి. మీకు యిష్టం లేకపోతే మాకూలీ యిచ్చేయండి. ఇంకెక్కడకన్నా పోయి కూలిచేసుకొంటాము. వొళ్లొంచి న్యాయంగా కష్టపడ్డవాళ్ల కెక్కడా పనిదొరక్కపోదు." అని తన నిశ్చయాన్ని గంభీరంగా చెప్పింది.

ఆమెమాటలు వినంగానే మేస్త్రీగుండెల్లో రాయిపడింది. ఆమె తిన్ను నిందించినందులకు చాలా కోపం వచ్చింది. కాని గట్టిగా బెదరిస్తే పనిలోకి రావటం మానేస్తుందేమో? పనిలోకి రావటం మానేస్తే మళ్లీ ఆమెను వశపర్చుకోటానికి వీలుండదు. అందువల్ల తనకు వచ్చేరాబడి తగ్గుతుం దనుకొని లక్ష్మిని చూచి సిగ్గుపడిన వానివలె నటిస్తూ – "లక్ష్మీ! నీవిషయంలో చాలా పొరపడ్డాను. అందరిలాంటిదానవే అనుకొని దొరగారిమాట తీసివేయలేక అడిగాను. నువ్వేమీ భయపడి కూలికి రావడం మానేయకు. దొరగారితో నువ్వలాంటిదానవు కావని చెప్పుతాను. ఇంతవరకూ జరిగిన సంగతంతా మరచిపో" అని ఆమెను నమ్మించి యిద్దరికూలీ యిచ్చి పంపేశాడు. దైవము తన్ను రక్షించాడనుకొని ఆనందంతో లక్ష్మి యిల్లుచేరుకొంది.

౪

అంటువ్యాధుల్లో కల్లా మోహపిశాచం చాలా ఘోరమైంది. అదిసోకిందంటే ఎలాంటివానినన్నా తల క్రిందులు చేసి వానిచేత ఎలాంటి ఘాతుకకృత్యాలను చేయించుటకన్నా వెనుదీయదు. మన వీరన్న నీమోహపిశాచం పూర్తిగా ఆవరించుకొంది. ఆమె పొందు కోసం రోజూ పరితపిస్తుండేవాడు. ఆమె ధనాశకు లొంగుట లేదని మేస్త్రీ చెప్పంగానే వీరన్న హృదయంలోని ఆశాజ్యోతి చల్లారింది. కాని మోహపిశాచం అతని వివేకాన్ని పారద్రోలి తనపడుచు బలాన్ని వినియోగించియైనా ఆమెను అనుభవించాలని ధృఢ సంకల్పించుకొన్నాడు.

వీరన్న తన్ను కామించి బలవంతపెట్టిన సంగతీ మేస్త్రీ తనతో అన్నమాటలూ తనభర్తతో చెప్పాలనుకొంది లక్ష్మి. కాని మేస్త్రీ యికముందు తనగొడవ తలపెట్టనని చెప్పుటచేతను, తనయందత్యంతానురాగము గలరామన్న యావ్వనోద్రేకంవల్ల ఏమన్నా అత్యాచారం చేయగలడనీ, ఒకవేళ యిక్కడ కూలిమానుకొంటే యింకెక్కడా తమకు స్థిరమైనపని దొరకదనీ ఆలోచించి ఆసంగతి రామన్నతో ఆమె చెప్పలేదు. ఆసంగతి జరిగిన తరువాత లక్ష్మి మామూలుగా కూలికి వస్తోంది. వారంరోజులనుంచి మేస్త్రీ మళ్లీ ఆప్రసంగాన్ని తేకపోవటం చేత తన కాగండం తప్పిందనుకొని లక్ష్మి చాలా సంతోషించి దేవుణ్ణి మనస్సులోనే ప్రార్థించుకొంది. ఆభర్తయైన రామన్న పదిలంఖణాలు చేసి యిప్పుడే కొంచెం కోలుకొంటున్నాడు.

ఆచుట్టుపట్ల మరిడమ్మదేవతను ఎరగనివారు ఆబాల గోపాలంమూ ఎవ్వరూ వుండరు. ఆమె చాలా సత్యమైనదని ప్రతీతి. అందులో యీపాటక పుజనానికి ఆమె కులదేవతగా ప్రసిద్ధిపొందినది. ప్రతి సంవత్సరమూ ఆమెజాతర చాలా వైభవముగా జరుగుతుంది. ఆచుట్టుపట్లు నున్న పల్లెలనుండి వేలకొలది జనం ఆజాతరకు పోయి తాము మొక్కుకొన్న మొక్కుబడులనన్నింటిని చెల్లించి వస్తుంటారు. ఆమరిడమ్మజాతరలో నో రెరుగని ఎన్నివేల ప్రాణులు గిజగిజలాడుతూ తమ వేడినెత్తురును ఆదేవిపిపాసను శాంతింప జేయుటకై ఆహుతి యవుతవో లెక్కకు రావు.

రామన్నకు వొంట్లో కులాసాగా వుంటే మరిడమ్మకు ఒకకోడిపెట్ట నిచ్చుకుంటానని లక్ష్మి మొక్కుకుంది. రామన్నమీద ఆమెకున్న ప్రేమను మాటలతో వర్ణించలేము. వారి దంత అన్యోన్యమైన దాంపత్యము. రామన్న కొంచెం కోలుకొంటూ వుండటం చూచి ఆమరిడమ్మజాతరలోనే ఆమె మొక్కు చెల్లిస్తే ఆదేవత తన్ను పరిపూర్ణానుగ్రహంతో చూస్తుందనుకొని సాయంత్రము అమ్మవారికై పండ్లూ, పసుపు, కుంకము, ఒకకోడిపెట్టను పట్టుకొని బయలుదేరింది జాతరకు లక్ష్మి.

లక్ష్మియింటినుంచి జాతర జరిగే ప్రదేశము సుమారు రెండుమైళ్ల దూరములో వుంటుంది. ఆ రెం

డింటికీ మధ్యనే మనకంట్రాక్టరు మేడవుంది. ఆరోజు వీరన్న తనమేడమీద నిలుచుండి జాతరకు వచ్చి పోయే జనాన్ని చూస్తున్నాడు. అతనిదృష్టిలో మన లక్ష్మి పడింది. ఆరోజు లక్ష్మి నిజంగా మహాలక్ష్మిలాగే వెలిగిపోతోం దనటంలో ఏమాత్రమూ సందేహం లేదు. సంకురాత్రిపండక్కు ఎంతోముచ్చటపడి రామన్న కొని యిచ్చిన నీలిరంగురేమనుసిల్కు చీర కట్టుకొని పెద్దాపురంసిల్కు గులాబీరంగురవిక తొడుక్కుంది. నిగనిగలాడుతూ నల్లత్రాచులాగ పిరుదలవరకూ వ్రేలాడుతోంది జడ. చంద్రబింబాన్ని వెక్కిరిస్తూన్న ఆమె మొహంమీద దమ్మిడీకాసంత కుంకంబొట్టు ఆమె మొహానికో క్రొత్త అందాన్ని చేకూరుస్తోంది. కుడిచేత పళ్లెం నిండా పళ్లూ, ఎడంచేతిలో కోడిపెట్టనూ పట్టుకొని వెర్రి ఆనందాన్ని పెదవుల్లోంచి వెదజల్లుతూ, వొయ్యార మొలకించు నడకతో మట్టెలను తాళం వేసుకొంటూ వెడుతోంటే ఆమెను మహాలక్ష్మిలాగున్నదనుకోనివాడు వెర్రివాడే! అప్రయత్నంగా ఆ దివ్యమూర్తి కళ్లబటటంతోనే, అంతవరకూ మూల మూలలా దాగియున్న కామమంతా వీరన్నలో సెల ఏటి ప్రవాహంలా కట్టలు తెంచుకొని పొంగిపొరిలింది. అతడు పూర్తిగా మోహావేశంలో పడి మైమరచిపోయాడు. ఆనాడు ఆమెను తాను అనుభవించకపోయినచో మరి యిక యీజన్మలో తన కా భాగ్యం కలగదనుకున్నాడు. వెంటనే క్రిందకు బోయి కుతంత్రాలోచనలకు ప్రారంభించాడు.

జాతరంటే జాతర కాదు. ఈ పాటకపుజనకోలాహలం భూనభోంతరాళాల్ని ప్రతిధ్వనింపజేస్తోంది. అమ్మవారినైవేద్యానికి వచ్చినబలులకు లెక్కలేదు. కోళ్లు, మేకపోతులు, ఎనుబోతులు అసంఖ్యాకముగా వున్నాయి. బలియిచ్చేవాని చేతిలోని కత్తి ఎడతెరపి లేకండా పనిచేస్తోంది. ఉదయమునుండి అవిరళముగా స్రవించుచున్న వేడినెత్తురు మడుగులుగట్టి జుమ్మని యీగలరొదతో నిండిఉంది. సాయంత్రము గడచి చీకటి పడుతోన్నది. చీకటి పడుతూన్నకొద్దీ జనం తండోపతండములుగా వస్తున్నారు. పాపం! లక్ష్మి యింటికి వెళ్లిపోవాలని ఎంత తొందరపడుతున్నా ఆమె మ్రొక్కు చెల్లించుకోటానికి తగిన అదను దొరకటంలేదు. చీకటిపడ్డకొలదీ ఆమెమనస్సు పరిపరివిధాల భీతితో తపించిపోతోంది. అతిప్రయాసమీద మ్రొక్కుబడి చెల్లించుకొని వెనక్కి మరలేటప్పటికి బాగా చీకటిపడిపోయింది. ఆమె బెదరిన లేడివలె ప్రక్కలకు చూస్తూ చురుగ్గా నడుస్తోంది. ఆమె వీరన్న మేడను సమీపించేటప్పటికి జనం పలచబడిపోయారు. జనసంచారం బొత్తిగా సన్నగిల్లినది. ఆచుట్టుప్రక్కల నుండేవారుమాత్రమే ఆతీర్థంలో వుండటంచేత లక్ష్మికి సాయంగా వచ్చేవాళ్లెవరూ లేకపోయారు. అక్కడక్కడా చింతచెట్లమీద కూర్చుండి గ్రుడ్లగూబల జంటలు వికారంగా కూస్తున్నాయి. పాపం! లక్ష్మి హృదయంలోని ఆరాటానికి అంతు లేదు. త్వరలో రావచ్చునని బయల్దేరింది. ఇంట్లో దీపం యింకా వెలిగించలేదు. పాపం! రామన్న తనరాకకోసం ఎంతగా బాధపడుతున్నాడో యని జాలిపడింది. ఆకారుచీకటిలో మద్దిచెట్లూ, మర్రిచెట్లూ జుట్టువిరియబోసుకున్న దెయ్యాల్లా కనుపిస్తున్నాయి. ఏదో చెప్ప నలవికానిభయం ఆమెను ఆవరించుకొంది. గుండెలు తటతటమని అతివేగంతో కొట్టుకొంటున్నాయి. ఆమె అతిభయంతో మెల్లగా పరుగు మొదలుపెట్టింది. ఆమె వీరన్నగుమ్మం దాటి ఫర్లాంగుదూరం వెళ్లిందో లేదో తటాలున యమకింకరుల్లాంటి నలుగురు మునక్కారులు ఆమెమీద పడి నోట గుడ్డలు క్రుక్కి కాళ్లూ, చేతులూ బంధించి మోసుకొనిపోయారు. ఈ క్షణికసంఘటనము గాంచి లక్ష్మి కొయ్యయైనది.

లక్ష్మి కన్నులు తెరచి చూసేసరికి ఆమె ఒక మెత్తనిపాన్పుపై పడివుంది. అది చాల విశాలమైన గది. పెద్ద నిలువుటద్దముగల డ్రాయరూ, రెండు కుర్చీలుమాత్ర మున్నాయి గోడలమీద పాశ్చాత్య నారీదిగంబరచిత్రాలు వ్రేలాడుతున్నాయి. ఆగదిని చూడంగానే లక్ష్మి సంగతంతా గ్రహించింది. ఆమె మనస్సులో పెద్దరాయి పడింది. భీతితో హృదయం బ్రద్దలయ్యేటంతటివేగంగా కొట్టుకొంటూన్నది. తన మానాన్ని కాపాడి, ఆగదిలోంచి విముక్తి నొందించమని దైవాన్ని దీనంగా ప్రార్థిస్తోంది. కన్నులలోంచి వెడలే అశ్రుప్రవాహం పరుపును పూర్తిగా తడిపేస్తోంది. అప్పుడు వీరన్న మైమరచేటట్లు సురను గ్రోలి

ఆగదిలోనికి వచ్చి కవాటమును బంధించాడు. అత్యధిక సురాపానమువలన వానినేత్రాలు చింతనిప్పుల్లాగు మండుతున్నాయి. ఆభీకరస్వరూపాన్ని చూడంగానే లక్ష్మి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయాయి.

మదోన్మత్తుడైయున్న వీరన్నకు సురాపానము అతనిని మరీ వెర్రివానిని చేస్తోంది. అతడు వికటాట్టహాసం చేస్తూ ఆమెను సమీపించి బంధనాలను తొలగించాడు సింహాన్ని చూచిన లేడిలాగ పాపం! లక్ష్మి పూర్తిగా బెదరిపోయింది. గట్టిగా సహాయార్థం కేకలు వేయాలనుకొన్నది. కాని అత్యధికభీతితో కరడుకట్టిన కంఠంలోంచి స్వరం పైకి వచ్చిందికాదు. ఒకవేళ తాను ఆర్తిగా కూతలిడినా! ఆ నిర్జనప్రదేశంలో ఆక్రూర జంతువు చేతుల్లోంచి తన్ను రక్షించేవాళ్లుండరని ఆమెకు తెలుసు. ఇహ దిక్కుతోచక వీరన్న పాదాల మీద పడి తన్ను రక్షించమని దీనంగా వేడుకొంది. కాని మోహాంధకారంలోవున్న ఆక్రూరమృగానికి జాలివుంటుందా? అతడు ఆమెను ఆక్రమించుకొన్నాడు కాని తనమానధనాన్ని గొల్లకొట్టనివ్వకండా అభిమానంతో వెర్రి ఆవేశాన్ని కల్పించుకొని అతనితో పెనగులాడుతోంది లక్ష్మి. ఆమె ఆటంకము వీరన్న హృదయంలో పౌరుషాన్ని రేకెత్తించింది. అసలేకోతి. అందు త్రాగివుంది. ఆపై తేలుకుట్టిందన్నట్లుగా! అసలే మోహాంధుడై వున్నాడు. దానికితోడు సురాపానపు మత్తూ, అన్నిటికన్నా యీమె ఆటంకమువలన కలిగిన పౌరుషమూ అతనిని పూర్తిగా వెర్రివానిని చేసివేసింది. వీరన్న తనబల మంతా వినియోగించాడు....

✂

ఇంకా బాగా తెల్లవారలేదు. అక్కడక్కడా పక్షులు గూళ్లనుంచి బైటకే తెంచి కూస్తున్నాయి. అప్పుడప్పుడు ఎండుటాకులను గలగలమని చప్పుడు చేస్తున్నాయి పందులు. లక్ష్మిదేహం చీరకు చుట్టపెట్టబడి దారిప్రక్కన వున్న డొంకలలో పరుండ బెట్టబడియుంది. ఆమెకు మెలకువ వచ్చి కన్నులు తెరచి చూచింది. ఆమసకచీకట్లో చెట్లూ, బొమ్మజెముడు డొంకలూ కనిపించాయి. తానక్కడి కెలా వచ్చానా అని ఆశ్చర్యపడింది. క్రమముగా ఆ క్రితమురాత్రి జరిగిన సంఘటనలన్నీ జ్ఞప్తికి వచ్చాయి. వొంట్లో చాలా నీరసంగా వుంది. లేచి కూర్చున్నది. వొంటిమీద రవిక లేదు. చీరమాత్రము చుట్టబెట్టబడి వుంది. దేహ మంతా సారాయికంపు కొడుతూ చాలా అసహ్యముగావుంది. నీరసంగా లేచి అతిప్రయత్నంతో చీరను కట్టుకొంది. బుగ్గలను వక్షాన్ని ఆనరపశువు ఆకామాంధుడు, మోహాన్ని పట్టలేక పూర్తిగా గాయపరిచాడు. నోరంతా ఆ త్రాగుబోతు ఎంగిలిసారా కంపుచే లోపలి ప్రేగులు తరుక్కొని పోతున్నాయి. గాయాలతోను, ఎంగిలితోను, సారాకంపుతోను, తోలుతిత్తిలాగ తయారయిన తనదేహాన్ని చూచుకొని వెక్కివెక్కి ఏడ్చింది లక్ష్మి. ఇన్నాళ్లనుంచీ అమితజాగ్రత్తతో పెంచుకొంటూన్న తనసౌందర్యం, పాతివ్రత్యం అంతా నేటితో భగ్నమయ్యాయని అనేకవిధాల విలపించింది. మూర్తీభవించిన శోకదేవతలా ఆ మసకచీకటిలో నీరసదేహాన్నీడ్చుకుంటూ యింటికి జేరుకుంది.

అక్కడ రామన్న జాతరకు వెళ్లిన లక్ష్మి ఎంత సేపటికీ రాకపోవటంచేత చాలా కంగారుపడ్డాడు. ఆమెకోసం వెదకుదా మనుకొంటే వొంట్లో బొత్తిగా వోపికలేదు. కాలు తీసి కాలుపెట్టలేనిస్థితిలో వున్నాడు. జ్వరం ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఎలాగో తూలుతూ దీపంమాత్రం వెలిగించి ఆమె రాకకోసం ఎదురు చూస్తూ ఆ రాత్రంతా నిద్రలేకండా గడిపాడు. ఆ సమయంలో జుట్టు విరియబోసుకొని, పూర్తిగా నలిగి సారాకంపు కొడుతూన్న శరీరంతో తూలుతూ వచ్చి భర్తను చూచి అవమానోద్రేకములతో రోదనచేస్తూ అతనిపాదములమీద వ్రాలి మూర్ఛపోయింది లక్ష్మి. అతడామెస్థితిగాంచి కలవరపాటు నొందాడు. ఆమె దేహంలోంచి వెలువడే సారాకంపు వానిని వుక్కిరిబిక్కిరి చేసేస్తోంది. వొంట్లో వోపికలేకపోయినా అతిప్రయాసమీద ఆమెను సేదదీర్చి కారణ మడిగాడు. లక్ష్మి దుఃఖభారంతో వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పింది. అసలే యౌవనపువుడుకురక్తం. అందులో తన ప్రియురాలికి జరిగిన అవమానం వినంగానే క్రోధోద్రేకంచే అతనిలోని రక్తం కరడుకట్టి

పోయింది. ఆఖండాలుడిపై పగ తీర్చుకోవాలని చూరులోని గండ్రగొడ్డలి తీసుకొని బయలుదేరబోయాడు. కాని రోగపీడితమై దుర్బలమైయున్న శరీరం ముందునకు ఏమాత్రము సాగలేదు. అతడు ముందునకు తూలి స్మృతివిహీనుడైనాడు.

లక్ష్మి తననాథుడిస్థితి, తనస్థితి బాగా ఆలోచించింది. ఇక తనభర్త క్రోధోద్రేకంతో తాళలేక ప్రాణాలకు తెగిస్తాడనుకొంది. ఇంతవరకూ కాపాడుకొస్తూన్న పాతివ్రత్యం భంగమయ్యాక ఈ ఎంగిలి శరీరాన్ని తిరిగి నాథుడికివ్వటం చాలా అపచారమనుకొని జీవితంమీద ఆశను వొదులుకుంది. వెంటనే ఆవేశంతో లేచి సీసాలోని కిరసనాయిలు అంతా చీరపై పోసుకొని, వెలుగుతున్న దీపానికి చీరకొంగు అంటించి నిశ్చలమనస్సుతో కూర్చుండిపోయింది. అగ్నిశిఖలు ఆమెదేహాన్నంతా ఆక్రమించుకొని మండుతున్నా, ఆసాధ్వి ఏమాత్రమును బాధను వెల్లడించలేదు. ఆవేళంతో మూర్ఛపోయిన రామన్న లేచి ఆభీకరదృశ్యమును జూచి కొయ్యరైపోయాడు. తనభార్యను రక్షించటంకోసం ఎలుగెత్తి నలుగురిసాయమూ కోరాడు. అప్పుడప్పుడే నిద్రలోంచి మేల్కొంటున్న పాటకపు జనమంతా బిలబిలలాడుతూవచ్చి ఆదృశ్యమును జూచి భయసంభ్రమములతో అనేకవిధాల ఆమెను రక్షించుటకు ప్రయత్నించారు. కాని ఆయగ్నిదేవుడు అనుపమానపతిభక్తిపరాయణురాలగు లక్ష్మిని తనలో నైక్యముచేసుకొని తన ఆనందాన్ని జ్వాలలరూపంగా వెల్లడిస్తున్నాడు. అందరూ నిస్పృహతో అతనిని కారణమడిగారు. రామన్న దుఃఖిస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన ప్రాణసమానురాలగు లక్ష్మి యీలోకంలోంచి పోవటంవల్లను, ఆనరపశువుమీద పగతీర్చుకోవాలన్న క్రోధావేశమువలనను అంతవరకూ అతినీరసముగావున్న అతని హృదయము ఒక్కసారి వ్రక్కలైంది. ఈ దారుణదృశ్యమును జూచి అందరూ జలజలమని కన్నీరుకార్చారు. ఇంతే నాశనమునకు కారకుడైన వీరన్నను పలువిధముల దూషించారు కాని ధనబలుడును పశుబలుడును నైనవానిని ఏమియు చేయలేకపోయారు.

౬

ఈఘోరం జరిగిన నెలరోజుల తరువాతి సంగతి. అమావాస్యరాత్రి ప్రపంచమంతా నిబిడగాఢాంధకారపరివృతమైయున్నది. అట్టినిశాసమయమున వీరన్న ఏదో అర్జంటుపనిమీద రాజమండ్రి వెళ్లి అతివేగంగా కారు నడుపుకొంటూ వస్తూన్నాడు. ఆనాడు అతడు లక్ష్మిమానాన్ని హరించి ఆమెను ఏపుంతదగ్గర నిస్సహాయురాలినిగా పారవేశాడో కారు అక్కడకు రాగానే వీరన్నకు అమితభయం వేసింది. ఆనాటి సంగతులన్నీ అతనికి జ్ఞప్తికి వచ్చినవి. ఎదురుగుండా జుట్టు విరియబోసుకుని అగ్నిగోళాల్లాంటి కన్నుల్లోంచి నిప్పులు గ్రక్కుతూ కాళికామూర్తివలె దారికడ్డంగానిలబడియున్న లక్ష్మిభీకరమూర్తి వానికంటబడింది. వీరన్న తాను గావించిన దుర్మార్గకృత్యము లన్నింటినీ జ్ఞప్తికి దెచ్చుకొని భయోద్రేకంతో కంపించిపోయాడు. కారు ఎటు తప్పిస్తే ఆమూర్తి అటు దారి నడ్డగిస్తోంది. వీరన్న పూర్తిగా పిచ్చివాడైపోయాడు. కారుకున్న వేగాన్నంతా యిచ్చేశాడు. లక్ష్మి భీకరమూర్తి వికటాట్టహాసం చేస్తూ అతనికన్నులయెదుట ప్రళయతాండవం చేస్తోంది. వీర్నన్న భయోద్రేకంతో పూర్తిగా నీరసుడైపోయాడు. అతని రక్తమంతా మంచులా గడ్డకట్టుకొనిపోయింది. స్టీరింగు స్వాధీనము తప్పింది. కారు అరవైమైళ్ల వేగంతో పరుగెడుతూ పెద్దమద్దిచెట్టును దాకి ప్రళయార్భాటము చేయుచు తుత్తునియలైపోయింది.

ఉదయమున యీవార్త గాలికంటే వేగంగా అన్నిచోట్లకు వ్యాపించింది. వేలకొలదిజనం పోగయి ఆదృశ్యాన్ని చూశారు. కారు పూర్తిగా తుత్తునియలై సగముపైగా కాలిపోయింది. ఆకుప్పలో వీరన్న దేహం చిత్రవధచేయబడి కమిలియుంది. మహాపతివ్రతమానాన్ని పశుబలంతో అపహరించిన దుర్మార్గుడికి తగినప్రతిఫలం జరిగిందనుకుంటూ పోయారు జనం. అంతమంది ప్రేక్షకులలోనూ ఒక్కనిట్టూర్పుగాని, ఒక్కకన్నీటిబొట్టునుగాని, ఒక్కసానుభూతివాక్యమునుగాని వెల్లడించినవారు లేరు.